



# కరపత్రం

SINCE 2014

మంగళవారం నవంబర్ 12 2024 | సంపుటి :0 | సంచిక : 334 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# దేశంలో మోదీ, గాంధీ.. రెండే వర్గాలు: సీఎం రేవంత్



హైదరాబాద్: మైనారిటీ సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "మెజారిటీ, మైనారిటీ ఇద్దరూ ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటి వారు. స్వాతంత్ర్యం రాగానే మౌలానా అబుల్ కలామ్‌ను నెహ్రూ విద్యాశాఖ మంత్రిని చేశారు. విద్యా వ్యవస్థలో మౌలానా అబుల్ కలామ్ అనేక విధానాలు తెచ్చారు. దేశంలో 2 వర్గాలే ఉన్నాయి ఒకటి మోదీ వర్గం.. మరొకటి గాంధీ వర్గం. హిందూ ముస్లిం భాయి భాయి అన్నదే కాంగ్రెస్ విధానం. చార్మినార్ వద్ద గతంలో రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర చేశారు. అదే చార్మినార్ వద్ద రాహుల్ గాంధీ కూడా సద్భావన యాత్ర చేశారు. నాలుగు ఎమ్మెల్సీల్లో ఒకటి మైనారిటీలకు ఇచ్చాం. ఈ ప్రభుత్వంలో అనేక పదవులు అప్పగించాం. మైనారిటీలకు మా పార్టీ 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది. వాళ్ల రిజర్వేషన్లను రద్దు చేసేందుకు మోదీ యత్నిస్తున్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేవారిని ఓడించాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వారిపై ఎస్మా కింద చర్యలు తీసుకోవాలన్నారు. పంటల కొనుగోళ్లలో మోసాలకు పాల్పడకుండా చూడాలన్నారు. రైతులను వేధిస్తే ఊరుకునేది లేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా కలెక్టర్లు చూడాలన్నారు. ఇబ్బందులుంటే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించాలని రేవంత్‌రెడ్డి చెప్పారు.

## ప్రియాంకా గాంధీకి రాహుల్ ఛాలెంజ్..!

- కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీకి సోదరుడు రాహుల్ గాంధీ సవాల్ విసిరారు.
- వయనాడ్‌ను ఉత్తమ పర్యాటక కేంద్రంగా మార్చాలని ఆమెకు ఛాలెంజ్ చేశారు.



వయనాడ్: వయనాడ్ ఉప ఎన్నికకు సమయం సమీపిస్తోంది. మరోసారి ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఈ స్థానం నుంచి బరిలోకి దిగిన పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా గెలుపు కోసం రాహుల్ గాంధీ ప్రచారం చేస్తున్నారు. తాజాగా ఇక్కడి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన.. తన సోదరికి ఓ సవాల్ విసిరారు. వయనాడ్‌ను ఉత్తమ పర్యటక ప్రదేశంగా మార్చాలని రాహుల్ ఆమెకు ఛాలెంజ్ చేశారు. "రాజకీయాలకు అతీతంగా వయనాడ్‌కు నా హృదయంలో గొప్ప స్థానం ఉంది. ఇక్కడున్న ప్రతి ఒక్కరికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నా.

పేజి 2లో

## ఏసీ బస్సుల్లో మెట్రో బస్ పాస్‌లకు 10శాతం రాయితీ!

- టీజీఎస్ఆర్టీసీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్‌పాస్ కలిగిన ప్రయాణికులకు శుభవార్త అందించింది



హైదరాబాద్: టీజీఎస్ఆర్టీసీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్‌పాస్ కలిగిన ప్రయాణికులకు శుభవార్త అందించింది. తమ వద్ద ఉన్న బస్‌పాస్‌లతో లహరి, రాజధాని, గరుడ ప్లస్, ఈ-గరుడ, తదితర ఏసీ సర్వీసుల్లో ప్రయాణిస్తే టికెట్‌పై 10 శాతం రాయితీని టీజీఎస్ఆర్టీసీ ప్రకటించింది.

12

## సమాజాన్ని విభజించేందుకు ప్రతిపక్షాల కుట్ర: ప్రధాని మోదీ



- గుజరాత్‌లోని వడ్తాల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు.

కులం, మతం, భాష, లింగం ప్రాతిపదికన సమాజాన్ని విభజించేందుకు ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

12

## కేసుల నుంచి తప్పించుకునేందుకే కేటీఆర్ ఢిల్లీ టూర్: మంత్రి పొన్నం

- తనపై వస్తున్న ఆరోపణలు, కేసుల నుంచి తప్పించుకునేందుకే భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఢిల్లీ టూర్‌కి వెళ్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.



2లో

# పత్తి రైతుల ఆందోళన..

## రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా?.. లేనట్లా?: హరీశ్‌రావు

**తెలంగాణ మార్కెటింగ్ శాఖ అలసత్వం, సమన్వయలోపంతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు.**

హైదరాబాద్: తెలంగాణ మార్కెటింగ్ శాఖ అలసత్వం, సమన్వయలోపం వల్ల పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణం తేమశాతం సహా ఇతర నిబంధనల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తేవాలని, అన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కనీస మద్దతు ధరకు అమ్ముకోలేని దుస్థితికి రాష్ట్ర రైతాంగాన్ని తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మండిపడ్డారు. అకాల వర్షాలతో దిగుబడి తగ్గి నష్టపోయిన పత్తి రైతులపై ప్రభుత్వం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఎక్స్ వేదికగా విమర్శించారు.
సీసీఐ, ప్రభుత్వ వైఖరికి నిరసనగా పత్తి కొనుగోళ్లు చేయబోమని రాష్ట్ర జిన్నింగ్, మిల్లుల యాజమాన్యాలు సమ్మె ప్రకటిస్తే సమస్యకు పరిష్కారం చూపే కనీస ప్రయత్నం చేయకపోవడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు అన్నారు. పత్తి రైతులు రోడ్ల పైకి వచ్చి ఆందోళన చేస్తుంటే రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా?.. లేనట్లా? అని ప్రశ్నించారు.








## హుటాహుటిన ఢిల్లీకి బయల్దేరిన కేటీఆర్

- టెండర్లపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేయనున్న కేటీఆర్

2లో

## 'చిత్రపురి'లో తెలంగాణ వారికే ప్రాధాన్యత: మంత్రి కోమటిరెడ్డి



- 'చిత్రపురి'లో కొత్తగా కట్టే ఫ్లాట్లలో తెలంగాణ వారికే ప్రాధాన్యం ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.

2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం నవంబర్ 12 2024

## ఏసీ బస్సుల్లో మెట్రో బస్ పాస్‌లకు 10శాతం రాయితీ!

మొదటిపేజీ తరువాయి

తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే అన్ని టీజీఎస్ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ఈ డిస్కౌంట్ వర్తిస్తుందని తెలిపింది. మెట్రో ఎక్స్‌ప్రెస్‌తో పాటు మెట్రో డిలక్స్, గ్రీన్ మెట్రో, ఎయిర్ పోర్ట్ పుష్పక్ బస్‌పాస్ కలిగిన ప్రయాణికులు ఈ రాయితీని పొందవచ్చు. వచ్చే ఏడాది జనవరి 31 వరకు 10 శాతం రాయితీ అమల్లో ఉంటుందని పేర్కొంది.
'హైదరాబాద్‌లో సుమారు 70 వేల వరకు మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్ పాసులున్నాయి. వారిలో ఎక్కువ మంది వీకెండ్‌లో సొంతూళ్లకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే బస్‌పాసుదారుల సౌకర్యార్థం ఏసీ సర్వీసుల్లో 10 శాతం రాయితీని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. సంస్థ అధికారిక వెబ్‌సైట్ %ష్ట్రజూ:׃׃స్త్రంతీ‌షెఎబం.ఱఅ% లో ముందస్తు రిజర్వేషన్ చేసుకుని రాయితీని పొందవచ్చు. జనరల్ బస్‌పాస్ దారులు 10 శాతం డిస్కౌంట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాం' అని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

## ప్రియాంకా గాంధీకి రాహుల్ ఛాలెంజ్..!

మొదటిపేజీ తరువాయి

ఈ ప్రాంత అందాలను ప్రపంచానికి చూపించాలి. ఉత్తమ పర్యటక ప్రదేశంగా మార్చాడానికి ప్రియాంక కృషి చేయాలి. ఎవరైనా కేరళ వస్తే మొదట ఈ ప్రాంతమే గుర్తుకు రావాలి. కాబోయే ఎంపీ ఇది ఛాలెంజ్‌గా తీసుకోవాలి. ఈ ప్రాంతానికి మంచి జరిగితే.. అది నాకెంతో సంతోషానిస్తుంది" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.
కాగా.. సార్వత్రిక ఎన్నికల్లో వయనాడ్, రాయ్‌బరేలీ సీట్లలో రాహుల్ గాంధీ గెలుపొందిన సంగతి తెలిసిందే. వయనాడ్‌ను వదులుకోవడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ స్థానం నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రియాంక గాంధీ తొలిసారి అడుగు పెట్టారు. విజయం సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. నవంబరు 13న పోలింగ్ జరగనుంది.

## సమాజాన్ని విభజించేందుకు ప్రతిపక్షాల కుట్ర: ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి

శ్రీ స్వామినారాయణ ఆలయం 200వ వార్షికోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని వడ్తాల్‌లో నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. కులగణన ను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న ప్రతిపక్షాలను దుయ్యబడుతూ తమ స్వార్థ ప్రయోజనాల కోసం సమాజాన్ని విభజించాలని చూసే వారి ఆలోచనలను ప్రజలు గుర్తించి, తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. దేశ వ్యతిరేకులు పన్నే కుట్రలను దేశ ప్రజలంతా కలసికట్టుగా ఎదుర్కోవాలని మోదీ పిలుపునిచ్చారు.
షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర వెనకబడిన తరగతులు అభివృద్ధి చెందడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందని ప్రధాని మోదీ అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఓబీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ఓబీసీలలోని కులాలను విభజించడానికి చూస్తున్నారని మండిపడ్డారు.
దేశం వేగంగా అభివృద్ధి చెందడానికి బలమైన, సమర్థులైన, విద్యావంతులైన యువతను తయారుచేయాలని పిలుపునిచ్చారు. నైపుణ్యం కలిగిన యువతే దేశ భవిష్యత్తుకు అతిపెద్ద బలం అవుతుందన్నారు. ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందని.. తాను ఏ దేశ నాయకులను కలిసినా భారత యువతలో ఉన్న ప్రతిభను పొగుడుతూ.. వారికి తమ దేశంలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇస్తున్నారని పేర్కొన్నారు. 2027లోపు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల వరుసలో నిలబెట్టడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని.. ఈ బాధ్యతను దేశ పౌరులు కూడా తీసుకోవాలని అన్నారు.

# అధికారులపై దాడి హేయమైన చర్య: ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్



హైదరాబాద్: వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీ భూసేకరణ ప్రక్రియలో భాగంగా వచ్చిన అధికారులపై స్థానికులు పాల్పడిన విషయం తెలిసిందే. అధికారులపై దాడికి ఉసిగొల్పిన, దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరుగకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరనున్నట్లు చెప్పారు. వాహనాలను సైతం ధ్వంసం చేశారని.. ఇది హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఇలాంటి దాడులతో ఉద్యోగులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ ఘటన నేపథ్యంలో వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఐజీ సత్యనారాయణ చేరుకున్నారు. ఘటనపై ఆరా తీస్తున్నారు.

## ఓయో హోటల్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం



రామంతపూర్‌లోని ఓ ఓయో హోటల్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం కలకలం రేపుతోంది. ప్రేమికుల మధ్య జరిగిన ఘర్షణతో ప్రియుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. బాధితుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. హైదరాబాద్ బేగంబజార్?కు చెందిన ఓంకార్ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి. అతను, సౌమ్య అనే యువతి ఇద్దరూ కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే వారిద్దరూ కలిసి రామంతపూర్ ప్రగతినగర్‌లో ఉన్న ర్లోని ఓయో రూమ్‌లో ఆదివారం రాత్రి అద్దెకు దిగారు. రాత్రంతా బాగానే ఉన్న ప్రేమజంట.. ఇవాళ తెల్లవారుజామున ఘర్షణకు దిగారు. విషయం ఏంటో తెలియదు కానీ గొడవ కారణంగా ప్రియుడు ఓంకార్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో యువతి బాత్ రూమ్‌కి వెళ్లిన వెంటనే ఆత్మహత్యాయత్నం చేశాడు. అలికిడి విడి బయటకు వచ్చిన యువతి ఫ్యాన్‌కు ప్రియుడు ఉరేసుకుని ఉండడాన్ని చూసి భయాందోళనకు గురైంది. వెంటనే ఓయో హోటల్ సిబ్బందికి సమాచారం ఇచ్చింది. దీంతో అందరూ కలిసి యువకుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించారు. అయితే వారిద్దరికీ ఎందుకు గొడవ వచ్చింది, ఓంకార్ ఎందుకు బలవన్మరణానికి పాల్పడ్డాడు వంటి విషయాలు తెలియరాలేదు. అయితే యువతిపైనా పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# యమున నదిలో కలుస్తున్న వ్యర్థాలు

### స్నానాలకు దిగిన వారికి వ్యాధులు ప్రబలే అవకాశం

### హెచ్చరిస్తున్న నిపుణులు



యమున నదిలో మునిగితే పుణ్యం రావడం దేవుడెరుగు.. రోగాల బారీన పడే అవకాశం ఉందని నిపుణలు హెచ్చరిస్తున్నారు. ఈ నీటిని చూస్తే హిమనీనాదాల్లోని గడ్డ కంటిన మంచుపలకాలు గుర్తుకువస్తున్నాయా లేదా ఏదైనా భారీ సినిమా కోసం వేసిన స్పెషల్ ఎఫెక్ట్‌లా కనిపిస్తోందా. అయితే మీరు పొరపడినట్లే. నీలి నింగిలో కదలాడుతున్న తెల్లటి మేఘాలు కావు ఇవి. హిమగిరుల్లో కరుగుతున్న మంచుకాదు ఇది. యమునా తీరానా నల్లటి నీటిలో తెల్లగా తేలియాడుతున్న విషపు నురుగులు ఇవి. నమ్మశక్యం కాకున్నా ఇది నిజం. యమునా నదీలో ప్రవహిస్తున్న అత్యంత విషపు నురుగులు ఇవి. పుణ్యనదుల్లో ఒకటైన యమునా జలాలు అత్యంత కలుషితంగా మారాయనడానికి ప్రత్యేక సాక్ష్యాలు ఇవి. పరిశ్రమల నుంచి విడుదలైన వ్యర్థాలు నదిలో కలుస్తుండటంతో విషపు నురుగులు తేలియాడుతున్నాయి. 90 శాతం వ్యర్థ జలాలు, 58 శాతం వ్యర్థాలు యమునా నదిలో కలుస్తున్నాయి. శుద్ధీ చేయని మురుగు నీటిని కూడా యమునలోకే వదిలేస్తున్నారు. మురుగు నీటిలో పాస్ఫేట్, ఆమ్లాలు ఉంటాయి. ఇవే విషపూరిత నురుగుగా ఏర్పడటానికి కారణమవుతుంది. ఈ కారణంగానే కొన్ని రోజులుగా యమునా నదిలో భారీగా నురుగులు వస్తున్నాయి. యమునా నదికి పురాణాల్లోనూ ఎంతో ప్రాశస్త్యం ఉంది. ఇది హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ గుండా ప్రవహిస్తూ ప్రయాగ వద్ద గంగా నదిలో కలుస్తుంది. గంగా నదికి ఎలాంటి పవిత్రత ఉందో అంతే పవిత్రత, పవనత యమునకు వచ్చాయి. అందుకే గంగా తర్వాత యమునాను పలుకుతారు. అలాంటి పుణ్యనది ఇప్పుడు కాలుష్యానికి అడ్డాగా మారింది. ఒకప్పుడు యమునాలో మునిగితే పుణ్యం వచ్చేది. కానీ ఆ పుణ్యం కోసం మయునాలో మునిగిన వారు అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికే వాయు కాలుష్యంతో కకావికలమైన ఢిల్లీవాసులను ఇప్పుడు నీటి కాలుష్యం భయపెడుతోంది. దేశ రాజధాని గుండా ప్రవహించే మయునా నది కాలుష్య కాసారమవుతూ విషాన్ని విరజిమ్ముతోంది. నదిలో కలిసిన రసాయనాల నురుగులుగా తేలుతున్నాయి. నదిలోని నీరు కూడా కనిపించనంత మందంగా రసాయనాల నురుగులు అలుముకున్నాయి. నది మొత్తాన్ని ఆక్రమించేశాయి. ఫ్యాక్టరీల నుంచి మురుగు నీరు, వ్యర్థాలను వదులుతుండటంతో యమునా నదిలో విషపూరితమైన తెల్లటి నురగ ప్రవహిస్తోంది. ఇక కార్తీక మాసం సందర్భంగా ఉత్తర భారతంలో నిర్వహించే ఛత్ పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పూజల్లో భాగంగా గంగా, యమునా నదుల్లో పుణ్య స్నానాలను ఆచరించి సూర్యభగవానుడికి పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహిస్తారు.

## 'మోదీ మా డిమాండింగ్ బాస్'..: జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు



కేంద్ర విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ ప్రధాని మోదీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన డిమాండింగ్ బాస్ అంటూ వ్యాఖ్యానించారు.

ముంబయి: ప్రధాని నరేంద్రమోదీ గురించి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన తమ 'డిమాండింగ్ బాస్' అని అన్నారు. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రధానితో జరిగే సమావేశాలు ఏవిధంగా ఉంటాయో వివరించారు.

"నిత్యం ప్రధాని మోదీతో మంత్రులకు సమావేశాలు జరుగుతుంటాయి. ఆయనతో సమావేశం అంటే చర్చించే విషయంపై కచ్చితమైన డేటాతో రావాల్సిందే. ఎందుకంటే, ఆ విషయంపై ఆయనకు పూర్తి అవగాహన ఉంటుంది. ప్రతి అంశంపై క్షుణంగా చర్చిస్తారు. ఆయన నిజాయతీ గల వ్యక్తి. ప్రధాని మా డిమాండింగ్ బాస్. నిజంగా ఆయనతో కలిసి పనిచేయడం నాకు ఎంతో ఆనందంగా ఉంటుంది" అని పేర్కొన్నారు.
"ఉక్రెయిన్- రష్యా యుద్ధం వేళ భారతీయ విద్యార్థులను రక్షించేందుకు ఎంతో కృషి చేశారు. అక్కడ ఉన్నవారికి ఎలాంటి హాని కలగకుండా స్వదేశానికి తీసుకురావాలంటూ మమ్మల్ని ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది దేశాధినేతలతో భారత్ సత్సంబంధాలు ఏర్పరుచుకుంది. ట్రంప్ సహా ఒబామా, జోబైడెన్‌ల హయాంలో అమెరికాతో స్నేహబంధం కొనసాగుతోంది. ఎంతమంది నేతలు మారినా ఆ దేశంతో బంధం స్థిరంగా ఉంది. అందుకు ప్రధాని మోదీనే కారణం" అని జైశంకర్ అన్నారు. మరోవైపు.. ముంబయిలో నిర్వహించిన ఇండియా-రష్యా బిజినెస్ ఫోరంలో పాల్గొన్న విదేశాంగ మంత్రి ప్రసంగించారు.

సమస్యలు పరిష్కరించుకోవాలి..
భారత్- రష్యా పరిష్కరించుకోవాల్సిన సమస్యలు చాలా ఉన్నాయన్నారు. ప్రతిపాదిత ఇండియా-యురేషియన్ ఎకనామిక్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై చర్చలను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. బ్యాంకింగ్, పేమెంట్, రవాణా సవాళ్లు, బీమా, మార్కెట్ ప్రవేశాలు తదితర సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 66 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యం.. 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల లక్ష్యానికి చేరుకోవాలన్నారు. అందుకు ఇరుదేశాల మధ్య సమస్యలను త్వరగా పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో రష్యా ఫస్ట్ డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ డెనిస్ మంటురోవ్ కూడా పాల్గొన్నారు.

## పత్తి రైతుల ఆందోళన..

### రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా?.. లేనట్లా?: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు ఫొటోలకు ఫోజులిచ్చిన మంత్రులు ఎందుకు మౌనంగా ఉన్నారని విమర్శించారు. పంట చేతికి వచ్చిన ఈ సమయంలో రైతుల జీవితాలతో చెలగాటమాడటమేంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. మిల్లుల వద్దకు చేరిన పత్తి లారీల లోడ్లతో రైతులు ఎన్ని రోజులు ఎదురుచూడాలని హరీశ్‌రావు నిలదీశారు. పక్క రాష్ట్రాల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనడానికి వెళ్లే సీఎం, మంత్రులకు రైతుల సమస్యలను పట్టించుకొనే సమయం లేదా అని ప్రశ్నించారు.

## కేసుల నుంచి తప్పించుకునేందుకే కేటీఆర్ దిల్లీ టూర్: మంత్రి పొన్నం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తనపై వస్తున్న ఆరోపణలు, కేసుల నుంచి తప్పించుకునేందుకే భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దిల్లీ టూర్‌కి వెళ్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బాధ్యతగల ప్రజాప్రతినిధిగా పోలీసుల విచారణకు కేటీఆర్ సహకరించాలన్నారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.
" కేంద్ర సహాయం కోసం కలిసి దిల్లీ వెళ్దామంటే.. ప్రతిపక్షాలు ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు మాత్రం కేటీఆర్ దిల్లీకి పరుగెడుతున్నారు. దిల్లీకి వెళ్లి 'అమృత్' పథకంపై ఫిర్యాదు చేస్తామని కేటీఆర్ చెబుతున్నారు. కార్ రేస్‌కు సంబంధించిన విచారణకు గవర్నర్ అనుమతి కోరాం. మేం ఎవర్నీ జైల్లో పెడతాం అనడం లేదు. తన రక్షణ కోసం కేంద్రం వద్ద మోకరిల్లేందుకు కేటీఆర్ దిల్లా వెళ్లారు. అలా ప్రజల దృష్టిని మరలిస్తున్నారు. అమృత్ పథకంలో అవినీతి జరిగితే కేంద్రానికి ఫిర్యాదు చేయవచ్చు. కానీ, మీ మీద జరిగే విచారణను తప్పించుకునేందుకే దిల్లీ వెళ్తున్నట్లు తెలుస్తోంది. విచారణకు సహకరించండి.. మీ చిత్తశుద్ధి నిరూపించుకోండి.
ఈ నెల 14 నుంచి ఏడాది పాలన విజయోత్సవాలు జరుపుతాం. ప్రభుత్వ విజయాలను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రతి మంచి పనిని ప్రజలకు వివరిస్తాం. రవాణాశాఖకు మరింత గౌరవం పెరిగేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే తెలంగాణ రవాణాశాఖ లోగోను విడుదల చేస్తాం" అని పొన్నం వెల్లడించారు.

## హుటాహుటిన ఢిల్లీకి బయల్దేరిన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

ఢిలీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు, అతని బృందంతో సోమవారం బయలుదేరారు. కంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కేటీఆర్ కలవనున్నారు. అమృత్ టెండర్ల విషయంలో కేంద్రమంత్రికి కేటీఆర్ ఫిర్యాదు చేయనున్నారు. అమృత్ టెండర్ల విషయంలో అవకతవకలు జరిగాయని సృజన్ రెడ్డిపై కేటీఆర్ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. రూ. 8,888 కోట్ల విలువైన టెండర్లను అక్రమంగా కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది సృజన్ రెడ్డికి టెండర్లు ఇచ్చారని బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తోంది. అమృత్ టెండర్లపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని కేటీఆర్ కోరుతున్నారు. కాగా.. తెలంగాణ రాష్ట్రంలో అమృత్ పథకం టెండర్లపై విచారణ జరిపి అక్రమాలు వెలికి తీయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, టోచన్ సాహులకు ఆయన శుక్రవారం లేఖ రాశారు. దీనిపై విచారణ చేసి నిజనిజాలు నిగ్గుతేల్చాలని లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడే అవినీతిలో కేంద్రానికీ వాటా ఉందని నమ్మాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రులకు లేఖ రాసిన విషయాన్ని ఆయన ట్విటర్ వేదికగా తెలియజేశారు.

## 'చిత్రపురి'లో తెలంగాణ వారికే ప్రాధాన్యత: మంత్రి కోమటిరెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: 'చిత్రపురి'లో కొత్తగా కట్టే ఫ్లాట్లలో తెలంగాణ వారికే ప్రాధాన్యం ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. చిత్రపరిశ్రమ కేవలం ఐదారుగురు పెద్దలదే కాదన్నారు. తెలంగాణ వాళ్లు ఎన్నో గొప్ప సినిమాలు తీశారని, 'మా భూమి' నుంచి 'బలగం' వరకు ఎన్నో గొప్ప చిత్రాలు తీశారన్నారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమ బాగా వృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఆరోసారి ఛైర్మన్‌గా ఎన్నికైన రామకృష్ణ గౌడ్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ అసోసియేషన్ ద్వారా ఆయన ఎంతో మందికి సహకారం అందిస్తున్నారని చెప్పారు. " చిత్ర పరిశ్రమ ఎవరో ఐదారుగురు పెద్ద వాళ్లదే కాదు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్లో సినిమా పట్ల ఆసక్తి ఉన్న అందరిదీ. 'మా భూమి' నుంచి 'బలగం' వరకు తెలంగాణ నుంచి ఎన్నో గొప్ప చిత్రాలు వచ్చాయి.
తెలంగాణలో సినిమా పరిశ్రమ బాగా అభివృద్ధి చెందాలనేది మా ప్రభుత్వ సంకల్పం. నా దగ్గరకు థియేటర్స్ ఇప్పించమని వచ్చే ప్రతి చిన్న సినిమా వారికీ నా వంతు సహకారం అందిస్తున్నా. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు 800 గజాల స్థలం

# తాజ్ మహల్ ను తలదన్నిన సర్దార్ పటేల్

ప్రత్యేక వ్యాసం

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



భారత టూరిజం రంగంలో నిన్నటి వరకు ప్రముఖంగా మొదటి స్థానంలో నిలిచిన తాజ్ మహల్ ఇప్పుడు రెండవ స్థానానికి నెట్టివేయబడింది.తాజ్ మహల్ ను వెనకకు నెట్టి సర్దార్ పటేల్ "స్టాచ్యు ఆఫ్ యూనిటీ" మొదటి స్థానాన్ని ఆక్రమించింది.గత సం.నుండి సర్దార్ పటేల్ విగ్రహాన్ని దర్శించే పర్యాటకుల సంఖ్య పెరిగింది.గత సం.తాజ్ మహల్ రెవెన్యూ అంటే ఆదాయం 56 కోట్ల రూపాయలు ఉంటే,సర్దార్ పటేల్ విగ్రహ సందర్శకుల నుండి 63 కోట్ల ఆదాయం లభించింది అని అధికారిక లెక్కలు తెలిపాయి.1632 సం.లో షాజహాన్,ఆగ్రా వద్ద యమునా నది ఒడ్డున కట్టినట్టుగా చెప్పబడుతున్న తాజ్ మహల్ ప్రేమకు చిహ్నమని ప్రచారం జరగడం వల్ల భారత దేశంలో నంబర్ వన్ పర్యాటక స్థలంగా తాజ్ మహల్ వెలుగొందింది.నరేంద్ర మోడీ 31 అక్టోబర్ 2019 లో గుజరాత్ లోని నర్మదా నది ఒడ్డున గల కేవడియా లో ప్రారంభించిన ప్రపంచంలోనే అధిక ఎత్తు గల సర్దార్ పటేల్ విగ్రహం ఇప్పుడు భారత దేశంలో నంబర్ వన్ ఆదాయం పొందింది.ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా తెలిపిన వివరాల ప్రకారం ఈ సం. తాజ్ మహల్ 81 కోట్ల రూపాయల ఆదాయం పొందితే, పటేల్ విగ్రహం స్టాచ్యు ఆఫ్ యూనిటీ సందర్శకుల వల్ల అత్యధిక ఆదాయం 115 కోట్ల రూపాయలు పొందింది.ఏ ఎస్ ఐ గణాంకాల ప్రకారం స్టాచ్యు ఆఫ్ యూనిటీ దేశంలో నంబర్ వన్ పర్యాటక ఆదాయం పొందింది అని అధికారిక ప్రకటన తెలిపింది.కుహనా ప్రేమ చిహ్నాం తాజ్ మహల్ మెల్ల మెల్లగా తన స్థానాన్ని కోల్పోతున్నది.సర్దార్ విగ్రహం స్టాచ్యు ఆఫ్ యూనిటీ మొదటి ఆదాయం పొంది, తాజ్ మహల్ ను రెండవ స్థానానికి నెట్టింది.ఈ ఆదాయం మారుతున్న భారత పర్యాటకుల ఆలోచనను తెలుపుతున్నది.

## పేద కుటుంబాలకు అండ కాంగ్రెస్ ప్రభుత్వం..



– సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సత్యనారాయణ..

**కరపత్రం శంకరపట్నం నవంబర్ 11**



పేదలకు అండ కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా మానకొండూరు నియోజకవర్గం బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ కింద 37 మందికి 6.73 లక్షల రూపాయలు మంజూరైనట్టు ఆయన వివరించారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. గతంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ విషయంలో చాలా అలసత్వం ఉండేదని ,ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. ఆర్థిక సహాయం త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, మండల అభివృద్ధి అధికారితోపాటు వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, పార్టీ నాయకులు పి. పోచయ్య ముదిరాజ్, సత్యం, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘటకేసర్ మండలంలో గుటకేసిన భూమిని కక్కించిన కలెక్టర్.



**కరపత్రం ప్రతినిధి,ఎల్ బి నగర్**

మేడ్చల్ జిల్లాలో రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కలెక్టర్ శ్రీ గౌతమ్ గారు కాపాడారు.

గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు వ్యక్తుల పరమైన దాదాపు రూ. 100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తిరిగి ప్రభుత్వ భూమిగా మార్చారు.

పత్రికా వార్తలతో వెలుగు చూసిన విషయానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ పంచాయతీ, కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వే నం.174లో 18 ఎకరాల 12 గుంటల ప్రభుత్వ భూమి ఉండగా 2017లో నాటి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం 6 ఎకరాల 12 గుంటల భూమిని కేటాయించింది.

వంద కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసిన ఓ మాజీ ప్రజాప్రతినిధి సహకారంతో,ఒక కుటుంబ సభ్యులు నీరుడి రామరావు, నీరుడి జంగయ్య, నీరుడి కిష్టయ్య, నీరుడి జంగమ్మ, నీరుడి సత్తయ్యలు నకిలీపత్రాలతో 12ఎకరాల భూమికి తమ పేరుపై పట్టాదారు పాసుపుస్తకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

విచారణ జరిపిన నాటి తహసీల్దారు ఆ దరఖాస్తును తిరస్కరించారు.మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 2023 అక్టోబరు 12న అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్ బదిలీ అయ్యే రోజే 12 ఎకరాల ఆ భూమిని ప్రైవేటు వ్యక్తుల పేరిట బదలాయించారు.

సర్వే నం.174/1/1/1/1/2 లో నీరుడి జంగయ్య తండ్రి వెంకయ్యకు 3 ఎకరాలు,

సర్వే నం.174/2లో నీరుడి రామారావు తండ్రి సత్తయ్యకు 3 ఎకరాలు,

సర్వే నం.174/1/2లో నీరుడి జంగమ్మ భర్త అంజయ్యకు 2ఎకరాలు,

సర్వే నం.174/1/1/2లో నీరుడి సత్తమ్మ భర్తకు 2 ఎకరాలు,

సర్వే నం.174/1/1/1/2లో నీరు డి కిష్టయ్యకు 2 ఎకరాల చొప్పున కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు.

దీనిపై శనివారం వెలుగు చూసిన వార్తతో కలెక్టర్ శ్రీ గౌతమ్ గారు నివేదిక తెప్పించుకొని,

వెంటనే రికార్డులను సరిచేసి తిరిగి ప్రభుత్వ భూమిగా మార్చినట్లు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ విజయేందర్‌రెడ్డి గారు మీడియాకు తెలిపారు.

## ధాన్యము కొనుగోళ్లలో ప్రభుత్వ ఉత్తర్వులు తప్పక పాటించాలి...

– సమగ్ర సర్వే క్షేత్రస్థాయి పరిశీలించిన..
– జిల్లా ప్రత్యేక అధికారి ఆర్ వి కర్ణన్..



**కరపత్రం శంకర పట్నం నవంబర్ 11**

ధాన్యము కొనుగోళ్లలో కొనుగోలుదారులు, రైస్ మిల్ యజమానులు, ప్రభుత్వ ఉత్తర్వులను తప్పక పాటించి ధాన్యమును రైతుల నుండి కొనుగోలు చేయాలని కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి ఆర్ వి కర్ణన్ ఆదేశించారు. సోమవారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలంలోని, కేశవపట్నం మార్కెట్ యార్డులో తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహ స హకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని, రాష్ట్ర ప్రభుత్వము నిర్వహిస్తున్న సమగ్ర సర్వే, కుల గణన, కుటుంబ వ్యక్తిగత ,ఉపాధి సర్వేను వంకాయ గూడెం గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రైతుల నుండి ధాన్యాన్ని దిగుమతి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వము నిర్వహిస్తున్న కులగనన సమగ్ర సర్వే ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిర్వహించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రపుల్ దేశాయి, కలెక్టర్ లక్ష్మీ కిరణ్ రెవెన్యూ, డిపిఓ రవీందర్, డి ఏ ఓ భాగ్యలక్ష్మి, హుజురాబాద్ ఆర్డిఓ రమేష్ బాబు, డిఎం సివిల్ సప్లై రజనీకాంత్, డీఎస్ఓ నర్సింగరావు, ఎంపీడీవో గోల్కొండ కృష్ణ ప్రసాద్, ఎంపీ ఓ కాసగోని ప్రభాకర్, డిప్యూటీ తాసిల్దార్ మల్లేశం, తాడికల్ సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ జమ్మికుంట ఆధ్వర్యంలో ఘనంగా దొంత రమేష్ జన్మదిన వేడుకలు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట నవంబర్ 11**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ రాష్ట్ర నాయకులు దొంత రమేష్ జన్మదిన వేడుకలు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. యువజన కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు తేలుకుంట్ల ప్రశాంత్ మాట్లాడుతూ దొంత రమేష్ రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఉండి ఎంతోమంది యువకులకు తన వంతు సహాయంగా సహాయ కార్యక్రమాలు చేస్తూ రాష్ట్ర యువతకు ఒక స్ఫూర్తిగా నిలబడి కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గంలో తనదైన శైలిలో సేవా కార్యక్రమాలకు ముందుండి నడిపిస్తున్నటువంటి దొంత రమేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అన్న కూడా యువజన కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు తేలుకుంట్ల ప్రశాంత్ , బొమ్మకంటి సందీప్ , కుర్రి అభిషేక్ , బొమ్మనేని అజయ్ , పంజాల అజయ్ , తోట అఖిల్, రాకేష్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## నడిరోడ్డుపై ఉన్న పాన్షాపను తొలగించిన మున్సిపల్ అధికారులు




**కరపత్రం ప్రతినిధి మహేశ్వరం నవంబర్ 11**

నియోజకవర్గం మీర్ పెట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని టీకేఆర్ కమాన్ పక్కన గ్రాండ్ హవేలీ హెూటల్ ముందు రోడ్డుపై పాన్ షాప్ ఉండడంతో మున్సిపల్ అధికారులు తొలగించడం జరిగింది.పాన్ షాప్ యజమాని కుటుంబసభ్యులు మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.మీర్ పెట్ పోలీసులు సంఘటననా స్థలానికి చేరుకుని పాన్ షాప్ కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి పక్కకు తీసుకెళ్లారు.

## సహ ఉద్యోగి సురేష్ కు శ్రద్ధాంజలి

మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ స్టాఫ్ మరియు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**కరపత్రం దినపత్రిక "కరుణాకర్ మల్లిగారి" మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి. నవంబర్ 10**



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాల్ లో మత్స్య శాఖ లో జూనియర్ అసిస్టెంట్ గ పని చేస్తున్న సురేష్ నిన్న సాయంత్రం మరణించడం జరిగినందున ఆయనకి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏ ఓ రామ్ మోహన్ గారు మాట్లాడుతూ సురేష్ చాల మంచి వ్యక్తి అని తమ వృత్తి పట్ల మంచి పేరు సంపాదించుకున్నది అలాగే మన అందరం కూడా తమ తమ వ్యక్తిగత ఇబ్బందులు ఎన్ని ఉన్న ఉద్యోగంలో ఒత్తిడి ఉన్న ఎవరికీ వారు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఎప్పటికప్పుడు హెల్త్ చెకప్ చేపించుకొని జాగ్రత్తగా ఉండాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో డి ఎం సివిల్ సుప్లిఎస్ ఎల్ సుగుణ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## సన్న రకం వడ్లకు 500 రూపాయలు ఏలాంటి డిమాండ్ లేకుండా చెల్లించాలి

**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్.**



ఎన్నికల వాగ్దానాల ప్రకారం, సన్న రకం వడ్లకు 500 రూపాయలు, ఇలాంటి డిమాండ్ లేకుండా చెల్లించాలి, గత వాగ్దానాల ప్రకారం, సన్నాళ్లు రకాలు డిమాండ్ చేయకూడదు, అన్ని రకాల సన్నాలకు 500 క్వింటాల్కు బోనస్ గా ఇవ్వాలి, అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలి, ఇది ప్రోత్సాహంగా ఉంటుంది, దొడ్డు రకాలు రైతులు వేయరు, అందుకే ప్రభుత్వాలు సహకరించి సన్నాలకు 500 చెల్లించాలి తక్షణమే, రైతు రక్షణ సమితి నర్సాపూర్ నియోజకవర్గం, చంద్రశేఖర్ మిర్యాల,

## ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు వ్యక్తికి తీవ్ర గాయాలు...

**'కరపత్రం శంకరపట్నం నవంబర్ 11**




కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలైన ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు 108 ఏఎంటి సతీష్ రెడ్డి, పైలట్ మతి గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం శంకరపట్నం మండలం చింతల పల్లె గ్రామానికి చెందిన మునిగంటి ఐలయ్య తన ఎక్సెల్ మోపెడ్ ద్విచక్ర వాహనంపై శంకరపట్నం వెళ్లి తిరిగి చింతల పల్లెకు వస్తుండగా మార్గమధ్యంలోని మొలంగూర్ బీసీ కాలనీ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం సమీపంలో వెనుక నుండి ఓ కారు వచ్చి ఐలయ్య మోపెడు వాహనాన్ని ఢీకొట్టడంతో ఐలయ్య క్రింద పడగా తలకు బలమైన గాయాలు కాగా కావడంతో, 108 వాహనానికి సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహన ఈఎంటి గూడూరి సతీష్ రెడ్డి, శాస్త్ర చికిత్సను అందించి, మెరుగైన వైద్యం కోసం హుజురాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం నవంబర్ 12 2024



# ఆ దర్శకులతో పనిచేయడం కష్టం..

బాలీవుడ్ దర్శక ద్వయం రాజ్ అండ్ డీకే ను ఉద్దేశించి ఆసక్తికర కామెంట్స్ చేశారు నటి సమంత . వారితో వర్క్ చేయడం ఎంతో కష్టంగా ఉంటుందన్నారు. తమ కాంబోలో వచ్చిన తొలి ప్రాజెక్ట్ 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' సిరీస్ షూట్ రోజులను గుర్తుచేసుకున్నారు. షూట్‌లో తాను బాగా ఏడ్చేశానని చెప్పారు."రాజ్ అండ్ డీకేతో కలిసి పని చేయడంతో పోలిస్తే తెలుగు, తమిళం చిత్రాల్లో వర్క్ చేయడం చాలా ప్రశాంతంగా ఉంటుంది. సాధారణంగా నా సినిమాల్లో ఒక రోజుకు రెండు లేదా మూడు సీన్స్ షూట్ చేసేవారు. కానీ ఇక్కడ అలా కాదు.. ఒక గంటలోనే ఆ సీన్స్ చిత్రీకరిస్తారు. రాజీ (ది ఫ్యామిలీ మ్యాన్ 2లో సమంత రోల్) పాత్రకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలు, ఫైట్ సీక్వెన్స్‌లను మొదటి షెడ్యూల్‌లోనే షూట్ చేశారు. రెండు రోజుల తర్వాత ఏడ్చుకుంటూ మా మేనేజర్‌కు ఫోన్ చేశా. నా వల్ల కావడం లేదు. ఇంటికి వచ్చేస్తానని చెప్పా. రానురాను వారి వర్కింగ్ స్టైల్‌కు అలవాటు పడ్డా. 'సిటడెల్ : హనీబన్నీ' కోసం మరోసారి ఈ టీమ్‌తో కలిసి వర్క్ చేయడం నాకు నచ్చింది" అని సమంత తెలిపారు.ఇదే ఇంటర్వ్యూలో పాల్గొన్న రాజ్ అండ్ డీకే మాట్లాడుతూ.. "ది ఫ్యామిలీ మ్యాన్ 2' షూట్ సమయంలో సమంత ఎన్నోరకాల భావోద్వేగాలతో సతమతమవుతున్నారని మాకు తెలియదు. చెన్నైలో రెండు రోజులు షూట్ పూర్తి కాగానే ఆమె మా వద్దకు వచ్చి.. చిత్రీకరణ పూర్తైందా? లేదా ఇంకేమైనా చేయాలా? అని అడిగింది. మేము అయిపోయింది అని చెప్పగానే తను చిన్నపిల్లలా ఏడ్చేసింది. ఏం జరుగుతుందో అర్థం కాలేదు. మేమిద్దరం ముఖాలు చూసుకుంటూ నిలబడ్డాం. ఆమెను బాగా కష్ట పెడుతున్నామని అర్థమైంది" అని చెప్పారు.'ది ఫ్యామిలీ మ్యాన్ 2' కోసం రాజ్ అండ్ డీకేతో తొలిసారి సమంత వర్క్ చేశారు. ఆ సిరీస్‌లో సమంత పాత్రకు విశేష ఆదరణ లభించింది. వీరి కాంబోలో వచ్చిన రీసెంట్ 'సిటడెల్: హనీ బన్నీ'. వరుణ్ ధావన్ కీలక పాత్ర పోషించారు. స్పై యాక్షన్ కథాంశంతో ఇది సిద్ధమైంది. ఎన్నో అంచనాల మధ్య నవంబర్ 7న అమెజాన్ ప్రైమ్ వేదికగా విడుదలైంది. హనీగా సమంత నటన యాక్షన్ ప్రియులను ఆకట్టుకుంది.

## అభిమానులకు కమల్ హాసన్ లేఖ

# నేనెప్పుడూ విద్యార్థినే.. ఇకపై నన్ను అలా పిలవొద్దు



"వనక్కం.. నన్ను చాలా కాలంగా ఉలగనాయగన్ తోపాటు వివిధ పేర్లతో పిలుస్తుండటాన్ని నేను ఎంతో గొప్పగా భావిస్తున్నాను. దీనికి మీకు రుణపడి ఉంటాను. ఉలగనాయగన్ వంటి ఎన్నో బిరుదులను అందించినందుకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడిని. మీరు నాపై చూపిన ప్రేమ నన్నెప్పుడూ కదిలించి వేస్తుంది" అని కమల్ అన్నాడు. అలాగే 'సినిమా అనేది ఓ వ్యక్తి కంటే ఎంతో గొప్పది. ఈ కళలో నేనో నిత్య విద్యార్థిని. ఆ రంగంలో ఎన్నో విషయాలు నేర్చుకోవాలని.. మరింత ఎదగాలని ఆశిస్తున్నాను. ఇతర కళల మాదిరిగానే సినిమా కూడా అందరికీ చెందినది. ఎంతో మంది కళాకారులు, సాంకేతిక నిపుణులు, ప్రేక్షకుల సహకారంతో నడిచేది కళ. అందువల్ల నేను అలాంటి అన్ని బిరుదులను (స్టార్ ట్యాగ్స్) ఎంతో మర్యాదపూర్వకంగా తిరస్కరిస్తున్నాను" అని కమల్ స్పష్టం చేశాడు. "అందుకే ఇప్పటి నుంచి నన్ను కేవలం కమల్ హాసన్ లేదా కమల్ లేదా కేహెచ్ అని మాత్రమే పిలవాలని నా అభిమానులు, మీడియా, సినిమా ఇండస్ట్రీ సభ్యులు, పార్టీ క్యాడర్, సాటి భారతీయులను కోరుతున్నాను. ఎన్నో ఏళ్లుగా మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు మరోసారి థ్యాంక్స్. ఈ నిర్ణయం ఎంతో వినయపూర్వకంగా తీసుకున్నదని, అందరిలో నన్నూ ఒకడిగా భావించాలన్న ఉద్దేశంతో తీసుకున్నదే" అని ఈ సందర్భంగా కమల్ హాసన్ లేఖలో వెల్లడించారు. దాంతో విశ్వ నటుడు, లోకనాయకుడు, ఉలగనాయగన్ పదాలు ముందులేకుండా సంబోధించడం కష్టం అంటూ సినీ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో మెసేజెస్ పెడుతున్నారు. ఇకపోతే కమల్ హాసన్ తన బ్యానర్లో (రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్) వరుస సినిమాలు నిర్మిస్తూ, నటిస్తూ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం మణిరత్నం డైరెక్షన్ లో థగ్ లైఫ్ లో నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది 2025 జూన్ 5న రిలీజ్ కానుంది.

# ఈ విషయం తెలిస్తే, జీవితం ప్రశాంతంగా గడిచిపోతుంది

"నేను చదివిన కథ ఇది. చైనాలో ముగ్గురు సన్యాసులు ఉండేవాళ్లు. వాళ్ల పేర్లు ఏంటో ఎవరికీ తెలియదు. కానీ, ముగ్గురు కలిసి ప్రయాణించేవారు. ఎవరికీ ఏమీ చెప్పేవారు కాదు. ఒకరోజు ఒక ఊరిలో ఉన్న నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి నవ్వటం మొదలు పెట్టారు. అక్కడ ఉంటున్న వారికి వాళ్లు ఎందుకు నవ్వుతున్నారో అర్థం కాలేదు. కానీ, వీళ్ల నవ్వు చూసి వాళ్లు కూడా నవ్వటం మొదలు పెట్టారు. కాసేపటికి, అక్కడ లాఫింగ్ క్లబ్ మొదలైంది" "ఎవరు ఎందుకు నవ్వుతున్నారో తెలియదు. ఆ నవ్వు మెల్లగా గ్రామమంతా పాకింది. ప్రతి ఇంటికీ చేరింది. అప్పుడు వాళ్లు ముగ్గురు మరో ఊరు వెళ్లారు. నవ్వటమే వాళ్ల ప్రార్థన. వాళు ఎలాంటి పాఠాలు చెప్పేవాళ్లు కాదు. నోరు విప్పి మాట్లాడేవాళ్లు కాదు. అన్నింటికీ కలిపి వాళు చేసిన ప్రార్థన నవ్వటం. చైనాలో వాళ్లు ఎక్కడకు వెళ్లినా వారిని ప్రేమించటం మొదలు పెట్టారు. 'బతికినన్ని రోజులు జీవితంలో నవ్వగలిగితే చాలు' అన్నది వాళ్ల ఉద్దేశం. చైనా అంతా తిరిగి నవ్విస్తూ బతికారు" "ఒకరోజు ఆ ముగ్గురిలో ఒక సాధువు చనిపోయాడు. ఊళ్లో వాళ్లందరూ పరిగెత్తుకొచ్చారు. చనిపోయిన సన్యాసిని చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. కానీ, కాసేపటికి మిగిలిన ఇద్దరు సాధువులు పెద్దగా నవ్వటం మొదలు పెట్టారు. ఊళ్లో వాళ్లకు అర్థం కాలేదు. 'ప్రాణ స్నేహితుడు చనిపోతే ఏడవకుండా ఎందుకు నవ్వుతున్నారు' అని ఒక వ్యక్తి అడిగాడు. అందులో ఒక సన్యాసి మొదటిసారి నోరు తెరిచి మాట్లాడాడు. 'నిన్న మీ ఊరికి వస్తూ మాలో ఎవరు ముందు చనిపోతారన్న ఆలోచన మాకు వచ్చింది. నేనంటే నేనని ముగ్గురం పందెం వేసుకున్నాం. ఇవాళ ఇతను చనిపోయాడు. నా స్నేహితుడు పందెం గెలిచాడు. అందుకే ఆనందంలో ఇద్దరం నవ్వుతున్నాం' అని అన్నారు" "జీవితంపై వాళ్ల ఆలోచన చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అప్పుడు చైనా సంప్రదాయ ప్రకారం వేసుకున్న బట్టలతోనే చనిపోయిన సన్యాసి శవాన్ని చుట్టి దహనం చేయడం మొదలు పెట్టారు. ఆ సన్యాసి బట్టల్లో టపాకాయలు దాచుకున్న విషయం ఎవరికీ తెలియదు. శవం కాలుతుంటే టపాకాయలు పేలాయి. జువ్వలు పైకి లేచాయి. ఊళ్లో వాళ్లందరూ కంగారు పడ్డారు. 'ఇవన్నీ బట్టల్లో పెట్టుకుని ఎవడైనా తిరుగుతాడా' అని అక్కడున్న ఒకాయన నవ్వితే ఊళ్లో వాళ్లందరూ విషయం తెలిసి నవ్వుకున్నారు. మనం ఇక్కడ పుట్టింది కేవలం నవ్వుకోవటం కోసమే అని తెలుసుకుంటే, జీవితం ప్రశాంతంగా గడిచిపోతుంది. మనం భూమిపై విజిటింగ్ కోసం వచ్చాం. టూర్‌లో ఉన్నప్పుడు చిన్న చిన్న సమస్యలు వస్తాయి. ఏ సమస్య వచ్చినా, అద్దంలో చూసి నవ్వుకోవటమే" అని పూరి జగన్నాథ్ చెప్పుకొచ్చారు.



# అలియా భట్‌తో సినిమా.. నాగ్ అశ్విన్ ఏమన్నారంటే!

ఇంటర్నెట్‌డెస్క్: 'కల్కి'తో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు నాగ్‌అశ్విన్. దీంతో ఆయన తర్వాత ప్రాజెక్ట్‌లపై సినీప్రియుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ టాలెంటెడ్ దర్శకుడు బాలీవుడ్ హీరోయిన్ అలియా భట్‌తో ఓ లేడీ ఓరియంటెడ్ సినిమా తీయనున్నారంటూ వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ కోసం అలియాతో చర్చలు కూడా జరిపినట్లు జోరుగా ప్రచారమవుతోంది. ఈవిషయంపై నాగ్ అశ్విన్ ఆంగ్ల మీడియాతో మాట్లాడారు. ఆ వార్తలన్నీ రూమర్సేనని స్పష్టంచేశారు. అలాగే తన తర్వాత సినిమా 'కల్కి2' అని అన్నారు. ప్రస్తుతం తాను 'కల్కి 2' పనుల్లో మాత్రమే బిజీగా ఉన్నట్లు చెప్పారు. దీంతో ఈ రూమర్స్‌కు తెరపడింది.నాగ్ అశ్విన్ గతంలో కీర్తిసురేశ్‌తో 'మహానటి' తీసి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఇదేతరహాలో అలియాతో కూడా ఓ సినిమా చేయనున్నట్లు కొన్ని రోజులుగా బాలీవుడ్ మీడియాల్లో వార్తలు వస్తోన్నాయి. ఈ విషయంపై నాగ్ అశ్విన్ క్లారిటీ ఇవ్వడంతో వాటికి చెక్ పడింది. ఇక ఆయన దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా వచ్చిన 'కల్కి 2898 ఏడీ' విడుదలైన అన్ని ప్రాంతాల్లో ఎంతటి విజయం సాధించిందో తెలిసిందే. ఇప్పుడీ చిత్రం జపాన్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. జనవరి 3వ తేదీ జపాన్‌లో రిలీజ్ కానుంది. తాజాగా దీనికి సంబంధించిన టీజర్‌ను విడుదల చేయగా అక్కడ మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది.

మరోవైపు 'కల్కి' పార్ట్2 షూటింగ్ జనవరి, ఫిబ్రవరిలో మొదలుపెట్టే అవకాశం కనిపిస్తోంది. చిత్రీకరణ ప్రారంభమైన తర్వాత పార్ట్ 2కు సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ ఇస్తామని నిర్మాతలు గతంలో తెలిపారు . మొదటిభాగం చిత్రీకరణ సమయంలోనే రెండో పార్ట్‌కు సంబంధించి కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. మరికొన్ని కీలక సన్నివేశాలు, వీఎఫ్ఎక్స్ పనులు పూర్తిచేయాల్సి ఉంది.

